జమిలి వస్తే కూటమి కుప్పకూలుతుంది

- రాష్ట్రాన్ని దోచేసి.. నారా రాజధానికి ఖర్చు
- కూటమి ప్రభుత్వంలో అన్ని వర్గాల ప్రజలపై అదనపు భారం
- ప్రజా వ్యతిరేక విధానాలపై రాజీలేని పోరాటం
- ఇప్పటికిప్పుడు ఎన్నికలు జరిగితే రాష్ట్రంలో వైఎస్సార్‌సీపీదే విజయం
- మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి


నాయకులతో కలిసి ర్యాలీలో మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి

వెంకటాచలం: కూటమి ప్రభుత్వం అన్ని వర్గాల ప్రజలపై మోయలేని భారాలు మోపుతోంది. ప్రజలను దోచేసి.. చంద్రబాబు కలల రాజధానిపై ఈ ఏడాదిలో రూ.లక్ష కోట్లు ఖర్చు చేస్తోంది. ప్రజల సంక్షేమాన్ని, స్థానికంగా అభివృద్ధిని గాలికి వదలేసి కూటమి చేస్తున్న పాపాలే శాపాలుగా మారుతాయని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డి చెప్పారు. జమిలి ఎన్నికలొస్తే.. కూటమి ప్రభుత్వం నామ రూపాల్లేకుండా కుప్పకూలతుందని కాకాణి స్పష్టం చేశారు. వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పిలుపు మేరకు సర్వేపల్లి నియోజకవర్గ కేంద్రం వెంకటాచలంలో కరెంట్ బిల్లుల బాదుడుపై శుక్రవారం పోరుబాట నిర్వహించారు. కసుమూరు క్రాస్‌రోడ్డు వద్ద నుంచి విద్యుత్ సబ్‌స్టేషన్ వరకు భారీ జనసందోహంతో ర్యాలీ నిర్వహించారు. కాకాణి గోవర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ ప్రజలను మోసం చేయడంలో చంద్రబాబును మించిన వారు దేశ రాజకీయాల్లోనే మరొకరు లేరన్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన వాగ్దానాలను ఏ ఒక్కటీ అమలు చేయకుండానే పాలన కొనసాగిస్తున్నారని విమర్శించారు. ఎన్నికల ప్రచారంలో నీకు రూ.15 వేలు.. నీకు రూ.15 వేలు..అంటూ ప్రజలను నమ్మించి అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ ఊసే లేకపోవడంతో ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత ఏర్పడిందన్నారు. విద్యుత్ చార్జీలు పెంచబోమని చెప్పిన చంద్రబాబు అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజలపై విద్యుత్ చార్జీలు పెంచి ప్రజలను మోసం చేశాడని దుయ్యబట్టారు. రాష్ట్ర ప్రజలపై రూ.15,485 కోట్లు అదనపు భారం మోపేందుకు సిద్ధమవుతుందని తెలియజేశారు. చంద్రబాబుకు ప్రయోజనాలు తెచ్చి పెట్టే రాజధాని కోసం రూ.48 వేల కోట్లతో టెండర్లు పిలవడం, మరో రూ.48 వేల కోట్లు ఖర్చు పెట్టే పనులు తప్ప ప్రజలకు ఉపయోగపడే పనుల చేయడం లేదని ఆరోపించారు.

అధికారం ఎవరికీ శాశ్వతం కాదు

అధికారం అనేది ఎవరికీ శాశ్వతం కాదని, అధికారం ఉందని, వైఎస్సార్‌సీపీ నాయకులను కార్యకర్తలను ఇబ్బందులు పెట్టే ఎవరినీ వదిలి పెట్టే ప్రసక్తే లేదని కాకాణి గోవర్ధన్ రెడ్డి స్పష్టం చేశారు. చంద్రబాబు ప్రభుత్వం అనుసరించే ప్రజా వ్యతిరేక విధానాల గురించి ప్రశ్నించే వారిపై అక్రమ కేసులు పెట్టి జైలుకు పంపడం సిగ్గు చేటన్నారు. మాజీ జెడ్పీటీసీ మందల వెంకటశేషయ్యపై అక్రమ కేసు పెట్టి జైలుకు పంపారని, ఎంత మందిని జైలుకు పంపినా రాజీలేని పోరాటాలు కొనసాగుతాయని స్పష్టం చేశారు. ఎప్పుడు ఎన్నికలు జరిగినా బుద్ధి చెప్పేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలను ప్రజల్లోకి తీసుకెళ్లి వైఎస్సార్‌సీపీని తిరిగి అధికారంలోకి తెచ్చేందుకు శాయశక్తులా కృషి చేస్తామన్నారు.

పోరుబాట సూపర్ సక్సెస్

కరెంట్ బిల్లుల బాదుడుపై వెంకటాచలంలో శుక్రవారం నిర్వహించిన పోరుబాట సూపర్ సక్సెస్ అయింది. పార్టీ నాయకులు అంచనాలకు మించి ప్రజలు స్వచ్ఛందంగా తరలివచ్చారు. ఉదయం 10 గంటలకే వెంకటాచలం, మనుబోలు, ముత్తుకూరు, పొదలకూరు, తోటపల్లిగూడూరు మండలాల నుంచి వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు వెంకటాచలం చేరుకున్నారు. కసుమూరు క్రాస్ రోడ్డు వద్ద నుంచి విద్యుత్ సబ్‌స్టేషన్ వరకు కొనసాగిన ర్యాలీలో కాకాణి వెంట వేల మంది జనం నడిచారు. ఈ ర్యాలీలో వైఎస్సార్‌సీ నాయకులు ప్లకార్డులు పట్టి కరెంట్ బిల్లుల పెంపునకు నిరసనగా నినాదాలు చేశారు. మహిళలు సైతం పోరుబాటలో పాల్గొన్నారు. కరెంట్ బిల్లుల బాదుడుపై విద్యుత్ శాఖ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీరుకు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో మండల వైస్ ఎంపీపీ కనుపూరు కోదండరామిరెడ్డి, మండల కన్వీనర్లు కొణిదెన మోహన్‌నాయుడు, మెట్టా విష్ణువర్ధన్‌రెడ్డి, హరిగోపాల్ రెడ్డి, శంకరయ్య గౌడ్, జెడ్పీటీసీలు పోట్లూరు సుబ్రహ్మణ్యం, శివప్రసాద్, జిల్లా నాయకులు కొణిదెన విజయభాస్కర్‌నాయుడు, ఆరుగుంట ప్రభాకర్‌రెడ్డి, వేమారెడ్డి రఘునందన్ రెడ్డి, మంచు శ్రీనివాసులునాయుడు, బచ్చుల సురేష్‌కుమార్‌రెడ్డి, గోగినేని గోపాల్‌రెడ్డి, దాసరి భాస్కర్ గౌడ్, వెలిబోయిన వెంకటేశ్వర్లు, అడపాల ఏడుకొండలు, డక్కిలి రమణయ్య, చీకుర్తి నరసయ్య, చంద్రశేఖర్ రెడ్డి, కడివేటి శివ తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న కాకాణి గోవర్ధన్‌రెడ్డి

ప్రభుత్వంపై పోరుబాట

- ప్రసన్న ఆధ్వర్యంలో బుచ్చిరెడ్డిపాళెంలో నిరసన
- పెల్లుబికిన ప్రజాగ్రహం
- భారీగా తరలివచ్చిన పార్టీ శ్రేణులు, ప్రజలు


వైఎస్సార్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న ప్రసన్నకుమార్‌రెడ్డి

బుచ్చిరెడ్డిపాళెం: ప్రజలపై కూటమి ప్రభుత్వం మోపిన విద్యుత్ భారాన్ని నిరసిస్తూ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత జగన్‌మోహన్‌రెడ్డి పిలుపు మేరకు పోరుబాట కార్యక్రమాన్ని బుచ్చిరెడ్డిపాళెంలో మాజీ మంత్రి నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించారు. ప్రజలు విశేషంగా తరలివచ్చి నిరసన కార్యక్రమంలో పాల్గొన్నారు. తొలుత పట్టణంలోని వైఎస్సార్ విగ్రహానికి నివాళులర్పించారు. భారీగా తరలిరావడంతో ముంబై రహదారి కిలోమీటర్ మేర కిక్కిరిసిపోయింది. ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ నినాదాలతో హోరెత్తించారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను నెరవేర్చకపోవడంపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేశారు.

బిల్లులు చెల్లించలేక ఆందోళన

విద్యుత్ చార్జీలకు సంబంధించి ఇప్పటికే రూ.ఆరు వేల కోట్ల భారాన్ని మోపారని, మరో రూ.9412.50 కోట్ల భారాన్ని జనవరి నుంచి వినియోగదారులపై మోపేందుకు సిద్ధంగా ఉన్నారని పార్టీ నేతలు ఆరోపించారు. వందల్లో వచ్చే బిల్లులు వేలకు చేరుకుంటున్నాయని, అంత మొత్తాన్ని చెల్లించలేక ప్రజలు ఆందోళనకు గురవుతున్నారని చెప్పారు. గతంలో ఎస్సీ, ఎస్టీ కుటుంబాలు 200 యూనిట్లలోపు విద్యుత్‌ను వినియోగిస్తే బిల్లులను చెల్లించాల్సిన అవసరం ఉండేది కాదని, అయితే ప్రస్తుతం చెల్లించాలంటూ నోటీసులను జారీ చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. బిల్లులు కట్టకపోతే ఇళ్లకెళ్లి మీటర్లను తొలగిస్తున్నారని, దళిత కాలనీల్లోని వారి జీవితాల్లో చీకట్లు నింపుతున్నారని మండిపడ్డారు. ఎస్సీ, ఎస్టీలకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్‌ను తక్షణమే పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. రూ.15 వేల కోట్ల భారాన్ని తక్షణమే ఉపసంహరించుకోవాలని కోరారు. అనంతరం ఏడీఈకి వినతిపత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో డీసీఎమ్మెస్ మాజీ చైర్మన్ వీరి చలపతిరావు, జొన్నవాడ దేవస్థాన చైర్మన్ మావులూరి శ్రీనివాసులురెడ్డి, గొల్లపల్లి విజయ్‌కుమార్, డీఏఏబీ మాజీ చైర్మన్ నిరంజన్‌బాబురెడ్డి, టంగుటూరు మల్లికార్జున్‌రెడ్డి, చెర్లో సతీష్‌రెడ్డి, ఐదు మండలాల పార్టీ అధ్యక్షులు తదితరులు పాల్గొన్నారు.


భారీ ర్యాలీ


ఏడీఈకి వినతిపత్రమిస్తున్న ప్రసన్న, తదితరులు

క్లుప్తంగా

ఆరోగ్యవంతమైన సమాజానికి తోడ్పాటు

నెల్లూరు(అర్బన్): అతి తక్కువ ఖర్చుతో పేదలకు వైద్యసేవలందిస్తూ ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణానికి పీఎంపీలు ఎంతో కృషి చేస్తున్నారని కమిషనర్ సూర్యతేజ పేర్కొన్నారు. ఆర్టీసీ బస్టాండ్ సమీపంలోని దేవిశెట్టి స్వాములు రాజేశ్వరి కల్యాణ మండపంలో శుక్రవారం నిర్వహించిన పీఎంపీ దినోత్సవానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడారు. ప్రాథమిక వైద్యసేవలందిస్తూ మంచి పేరు తెచ్చుకోవడాన్ని అభినందించారు. అనంతరం న్యూరో, ఆర్థో, జనరల్, గుండె తదితర విభాగాల్లో వచ్చిన నూతన వైద్యవిధానాలపై పీఎంపీలకు అవగాహన కల్పించారు. ఉచితంగా నిర్వహించే కేన్సర్ పరీక్షలు చేయించుకోవాలని రూపొందించిన పోస్టర్లను ఆవిష్కరించారు. 70 ఏళ్లు నిండిన పీఎంపీలను సత్కరించారు. పీఎంపీ జిల్లా అధ్యక్షుడు శాఖవరపు వేణుగోపాల్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో నెల్లూరు రూరల్ డీఎస్పీ శ్రీనివాసరావు, నారాయణ మెడికల్ గ్రూప్ ఏజీఎం చౌకచర్ల భాస్కర్‌రెడ్డి, సంఘ కార్యదర్శి గోరంట్ల శేషయ్య, జిల్లా నేతలు దేవరకొండ శ్రీనివాసులు, ప్రసాద్, రామదాసు, వీరయ్య, మాలిని, జయప్రకాష్, రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

సర్వీస్ ప్రొవైడర్ల ఎంపికకు దరఖాస్తుల ఆహ్వానం

నెల్లూరు(బారకాసు): నెల్లూరు కార్పొరేషన్‌తో పాటు కావలి, కందుకూరు, ఆత్మకూరు, బుచ్చిరెడ్డిపాళెం మున్సిపాలిటీల పరిధిలో ప్లంబర్, కార్పెంటర్, ఎలక్ట్రీషియన్, ఏసీ, గీజర్, టీవీ, రిఫ్రిజిరేటర్, వాషింగ్ మెషీన్ తదితరాలను రిపేర్ చేసే వారితో పాటు బ్యూటీషియన్, బార్బర్ తదితరుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నామని మెప్మా పీడీ రాధమ్మ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎన్నెస్డీసీ, ఎస్డీసీ, ఎన్ఏసీల ద్వారా నైపుణాభివృద్ధి శిక్షణ ఇచ్చి సర్టిఫికెట్‌తో పాటు అర్హత పొందిన వారికి హోమ్ ట్రయాంగిల్ ఆన్‌లైన్ ప్లాట్‌ఫాం ద్వారా జీవనోపాధిని కల్పించనున్నామని వివరించారు. ఆసక్తి గల వారు నెల్లూరు మున్సిపల్ కార్పొరేషన్‌తో పాటు ఆయా మున్సిపాలిటీలు, మెప్మా కార్యాలయాల్లో తమ వివరాలను ఈ నెలాఖరులోపు నమోదు చేసుకోవాలని కోరారు. అన్ని మున్సిపాలిటీల్లో సర్వీస్ ప్రొవైడర్స్ రిజిస్ట్రేషన్ మేళాను జనవరి 1, 7వ తేదీల్లో నిర్వహించనున్నామని వివరించారు. అర్హులు తమ రేషన్, ఆధార్, పాన్ కార్డులతో పాటు బ్యాంక్ పాస్‌బుక్, విద్యార్హత సర్టిఫికెట్ జిరాక్స్, రెండు ఫొటోలతో హాజరుకావాలని, వివరాలకు 79013 11585 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

డైరీ ఆవిష్కరణ

నెల్లూరు (పొగతోట): ఆంధ్రప్రదేశ్ అసోసియేషన్ ఆఫ్ సెక్రటేరియెట్ ఇంజినీర్స్ సంఘ డైరీని పంచాయతీరాజ్ ఎస్ఈ అశోక్‌కుమార్ ఆవిష్కరించారు. పంచాయతీరాజ్ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన కార్యక్రమంలో ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ సత్యనారాయణరెడ్డి, పీఆర్ డిప్లొమా ఇంజినీర్ల సంఘ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు సుమన, పీఆర్ ఇంజినీర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు బాబూరావు, ఇంజినీర్ల సంఘ జిల్లా అధ్యక్షుడు ఖాదర్‌మస్తాన్, పంచాయతీరాజ్ అసోసియేషన్ ఆఫ్ ఇంజినీర్ల సంఘ రాష్ట్ర నేత హరికృష్ణ పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కార్యకర్తలకు పుస్తకాల పంపిణీ



కొడవలూరు: స్త్రీ, శిశు సంక్షేమ శాఖ 3, 4 ప్లస్ పేరుతో నూతనంగా పంపిణీ చేసిన పుస్తకాలు ప్రీ స్కూల్ పిల్లలకు వరం లాంటివని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ తలపల నాగభూషణమ్మ పేర్కొన్నారు. మండలంలోని గండవరంలో నార్తురాజుపాళెం సెక్టార్ పరిధిలో గల అంగన్‌వాడీ కార్యకర్తలకు ఐసీడీఎస్ సరఫరా చేసిన నూతన పుస్తకాలను శుక్రవారం పంపిణీ చేసిన అనంతరం ఆమె మాట్లాడారు. ఈ పుస్తకాల ద్వారా ప్రీ స్కూల్ పిల్లలు తెలుగు, ఇంగ్లిష్, గణితాన్ని సులువుగా నేర్చుకోగలరని చెప్పారు. వీటిని అంగన్‌వాడీ కేంద్రాల్లోని పిల్లలు సద్వినియోగం చేసుకునేలా కార్యకర్తలు కృషి చేయాలని కోరారు.

మన్మోహన్‌సింగ్ మృతి తీరని లోటు


నివాళులర్పిస్తున్న ప్రసన్నకుమార్‌రెడ్డి తదితరులు

బుచ్చిరెడ్డిపాళెం: ప్రపంచ పటంలో భారత దేశాన్ని తిరుగులేని శక్తిగా చేసిన మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ మృతి చెందడంపై మాజీ మంత్రి నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. పోరుబాటలో భాగంగా వైఎస్సార్ కూడలిలో మన్మోహన్‌సింగ్ చిత్రపటానికి శుక్రవారం నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. మన్మోహన్‌సింగ్ చిరస్మరణీయులని, ఆయన మృతి దేశానికి తీరనిలోటని చెప్పారు. ఆయన చిత్రపటానికి నియోజకవర్గంలోని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నేతలు నివాళులర్పించారు.

పేదలకు ఉపయోగంగా ఫ్యామిలీ డాక్టర్



కొడవలూరు: ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం పేదలకు ఎంతో ఉపయోగకరంగా ఉందని వైద్యాధికారి కామాక్షయ్య పేర్కొన్నారు. మండలంలోని రామాపురంలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని యల్లాయపాళెం పీహెచ్‌సీ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురికి వైద్య పరీక్షలు చేసి మందులను అందజేశారు. కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. హెచ్ఎస్ సురేంద్ర, ఎమ్మెల్‌హెచ్‌పీ జాస్మిన్, ఏఎన్ఎంలు సుమతి, సరిత తదితరులు పాల్గొన్నారు.

మన్మోహన్‌సింగ్ మృతికి ఘన నివాళులు



వెంకటాచలం: మాజీ ప్రధాని డాక్టర్ మన్మోహన్ సింగ్ మృతి చెందడంతో వీఎస్‌యూలో ఆయన చిత్ర పటానికి శుక్రవారం ఇన్‌చార్జి వీసీ విజయభాస్కరరావు పూలమాల వేసి నివాళులర్పించారు. దేశానికి మన్మోహన్ సింగ్ చేసిన అపూర్వమైన సేవలను గుర్తు చేసుకుంటూ రెండు నిమిషాలు మౌనం పాటించారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి రిజిస్ట్రార్ డాక్టర్ కె.సునీత, ప్రిన్సిపల్ సీహెచ్ విజయ, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ముత్తుకూరులో రెవెన్యూ సదస్సు


మాట్లాడుతున్న అధికారులు

ముత్తుకూరు: ముత్తుకూరు సచివాలయంలో శుక్రవారం రెవెన్యూ సదస్సు జరిగింది. స్థానికుల నుంచి తొమ్మిది అర్జీలు అందాయి. కేవలం నలుగురు రైతులు మాత్రమే హాజరయ్యారు. అధికారులే అధికంగా కనిపించారు. రీసర్వే డీటీ శ్రీనివాసులు, సర్వేయర్ అనురూప్, నాయకులు రవీంద్రరెడ్డి, షఫీఉల్లా, మల్లికార్జునయాదవ్ పాల్గొన్నారు.

చిత్ర నివాళి


రావి ఆకుపై గీసిన మన్మోహన్‌సింగ్ బొమ్మ

పొదలకూరు : మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్‌కు మండలంలోని మహ్మదాపురం విశ్రాంత ఉపాధ్యాయుడు పచ్చా పెంచలయ్య రావి ఆకుపై ఆయన చిత్రాన్ని గీసి నివాళులర్పించారు. ఈ దేశానికి ఆయన చేసిన సేవలను, భారత ఆర్థిక వ్యవస్థను గాడిలో పెట్టారని కొనియాడారు.

ప్లాస్టిక్ వినియోగంతో అనర్థాలు



ఇందుకూరుపేట: ప్లాస్టిక్ వినియోగంతో అనర్థాలు సంభవిస్తాయని కృషి విజ్ఞాన కేంద్ర శాస్త్రవేత్త డాక్టర్ కిరణ్‌కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని జగదేవిపేటలో ఎన్నెస్సెస్ కార్యక్రమాన్ని వెంకటేశ్వర కళాశాల అగ్రికల్చర్ విద్యార్థులు శుక్రవారం నిర్వహించారు. తొలుత గ్రామంలో ర్యాలీని చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. వస్త్ర సంచులను వినియోగించాలని కోరారు. జీవన ఎరువులపై రైతులు దృష్టి సారించాలని సూచించారు. వెంకటేశ్వర కళాశాల అధ్యాపకురాలు శైలజ పాల్గొన్నారు.

ఊరూరూ.. పోరుబాట


పొదలకూరు: బిరదవోలు పంచాయతీ నుంచి తరలివెళ్తున్న నాయకులు

పొదలకూరు : రాష్ట్ర ప్రభుత్వం విద్యుత్ చార్జీల పెంపును నిరసిస్తూ వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన పిలుపు మేరకు నియోజకవర్గాల కేంద్రంలో ఆ పార్టీ ఆధ్వర్యంలో శనివారం పోరుబాట నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి ఆధ్వర్యంలో వెంకటాచలంలో నిర్వహించిన కరెంట్ పోరుబాటకు నియోజకవర్గ వ్యాప్తంగా ఊరూరు.. తరలిపోయాయి. మండలం నుంచి ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు శుక్రవారం భారీగా తరలివెళ్లారు. వివిధ గ్రామాల నుంచి స్వచ్ఛందంగా నాయకులు, కార్యకర్తలు తరలి వెళ్లి విజయవంతం చేశారు.

ముత్తుకూరు: కూటమి ప్రభుత్వం పెంచిన విద్యుత్ చార్జీలకు వ్యతిరేకంగా వైఎస్సార్‌సీపీ తలపెట్టిన పోరు బాటకు శుక్రవారం పెద్ద సంఖ్యలో నాయకులు, కార్యకర్తలు తరలివెళ్లారు. మండలంలోని పలు గ్రామాల నుంచి నాయకులు, పార్టీ శ్రేణులు వివిధ వాహనాల్లో వెళ్లి కూటమి ప్రజా వ్యతిరేక పాలనపై నిరసన గళం విప్పారు.

మనుబోలు: విద్యుత్ చార్జీల బాదుడుకు నిరసనగా వెంకటాచలంలో శుక్రవారం నిర్వహించిన పోరుబాటకు మండలం నుంచి వైఎస్సార్‌సీపీ నాయకులు భారీగా తరలివెళ్లారు. కార్యక్రమంలో నాయకులు బొమ్మిరెడ్డి హరగోపాల్‌రెడ్డి, మధుసూదన్‌రెడ్డి, కడివేటి చంద్రశేఖర్‌రెడ్డి, ముంగర రవీందర్‌రెడ్డి, దాసరి భాస్కర్‌గౌడ్, ఆవుల తులసీరాం, కంచి మణి, భాస్కర్‌రెడ్డి, మహేంద్రవర్మ, నవకోటి, దయాకర్, కోటేశ్వరగౌడ్, రామకృష్ణ తదితరులున్నారు.


ముత్తుకూరు: పంటపాళెం నుంచి తరలిన నాయకులు


మనుబోలు: నిరసన తెలుపుతున్న నాయకులు

బీజేపీ మండలాధ్యక్షుడిగా శ్రీనివాసులురెడ్డి


అభినందిస్తున్న నేతలు

ఇందుకూరుపేట: బీజేపీ మండలాధ్యక్షుడిగా కైలాసం శ్రీనివాసులురెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. పార్టీ మండల ఉపాధ్యక్షుడు నెల్లూరు శ్రీనివాసులురెడ్డి ఆధ్వర్యంలో ఎన్నికల అధికారి బ్రహ్మానందరెడ్డి పర్యవేక్షణలో కార్యక్రమాన్ని ఇందుకూరుపేటలో నిర్వహించారు. పార్టీ పటిష్టతకు శక్తి వంచన లేకుండా కృషి చేస్తానని పేర్కొన్నారు. చిరమన జనార్దన్‌రెడ్డి, లేబూరు సతీష్‌రెడ్డి, దువ్వూరు శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.